# జీవితం అంచున



చుక్కల రాత్రి. నీలాకాశం మిలమిల లాడుతోంది. ఆకాశం సాక్షిగా సముద్ర కెరటాలు వెక్కి వెక్కి ఏడుస్తున్నాయి. ఒడ్డు నిర్మానుష్యంగా ఉంది. కఠిన పాదాల కింద నలిగిపోయిన ఇసక చల్లగాలిలో గాయాల్ని నిమురుకుంటోంది.

దయాకర్ నిశ్శబ్దంగా నడుస్తున్నాడు ఒడ్డు వెంట. అడుగులు నిదానంగా.... అంతా ఒక మగత.... ఆలోచనల ముక్కలు.... ఒక మహా ప్రయత్నానికి లేని హుషారు తెచ్చుకుంటూ.... 'ఈ అర్ధరాత్రీ, చీకటి ప్రపంచం నన్నింకేం భయపెట్టలేవు' అనుకున్నాడు. అలలు కాళ్లకి తగిలి వెనక్కిపోతున్నాయి.

'ఇవాళ సముద్రం లోతెంతో చూస్తాను. సముద్రం నన్నేలా ఏం చేస్తుందో చూస్తాను. ఇంతేనటే సంద్ర మెంతొ అనుకొంటి, మనకూ సూరీడుకూ మద్దెనుందేనా....' - సన్నగా ఈల వెయ్యసాగాడు. ఈలలో లీలగా అపస్వరం.

'ఈ రాత్రి సముద్ర మెందుకో ఏడుస్తుంది వెక్కి వెక్కి' అనుకున్నాడు, ఇంకా ఇంకా దూరం నడుస్తూ. 'నోరెత్తి హోరెత్తి నొగులు సాగరము, కరి కళేబరములా కదలదు కొండ'..... 'నిజంగా సముద్రమేనా ఏడుస్తోంది?... అదేమిటి, సన్నగా ఎక్కణ్ణుంచో ఏడుపు వినబడుతోంది? ఈ సమయంలో నా కన్నా దౌర్భాగ్యులెవరున్నా రిక్కడ?..'

దయాకర్ కళ్లు చిట్లించి చూశాడు చీకట్లో. కొంచెం దూరంగా ఒక రాయిమీద ఎవరో స్త్రీమూర్తి కూర్చున్నట్టుంది. ఆశ్చర్యం! అర్ధరాత్రి, ఈ వాతావరణంలో... దెయ్యం కాదుగదా! అయినా ఈ చివరి దశలో తనింకా దెయ్యాల గురించి భయపడటమేమిటి? మెల్లగా సమీపించాడామెని. అతని కాళ్లకింద ఇసక గరగర విని తలెత్తి చూసింది. ఒక్కసారిగా భయంతో నిలువెల్లా వణికిపోయింది.

"నో! దగ్గరకి రావద్దు. నీకు దొరకను. ఈ సముద్రంలో దూకుతాను, రాస్కెల్! నన్ను బలవంతం చేసి ఏం సాధిస్తావు?...."

గొంతులో తీవ్రతని విహ్వలత్వం మింగేసింది. గుండెలు పగిలేట్టు ఏడుస్తోంది.

స్తంభించిపోయాడు దయాకర్. ఎవరామె? తనని చూసి ఎవరో అనుకొని ఎందుకంత భయపడుతోంది? తన మూలంగా ఆమె ఏడుపు ఎక్కువ కావటం సహించలేక పోయాడు. అడుగు ముందుకేస్తే నిజంగానే సముద్రంలో దూకుతుందేమో! అక్కడే ఆగి, నెమ్మదిగా అడిగాడు.

"ఎవరు నువ్వు? ఎందుకేడుస్తున్నావు?"

ఈసారి ఆమె ఆశ్చర్యపోయింది. ఇతను వాడు కాదా? ఎవరో కొత్తవ్యక్తి. ఎవడైతేనేం? ఒంటరి ఆడదాని దగ్గర ప్రతివాడూ దుర్మార్గుడే.

"ముందు నువ్వెవరో చెప్పు" కఠినంగా అడిగింది.

"ఎవరో మనిషిని" నిర్లిప్తంగా జవాబిచ్చాడు దయాకర్.

"హు... అందరూ మనుషులే. నిస్సహాయుల్ని మాత్రం కాటేస్తుంటారు."

దయాకర్ ఒక్కసారి ఆమెని పరీక్షగా చూశాడు. ముఖ కవళికలు స్పష్టంగా కన్పించటం లేదు. జుట్టు చిందరవందరగా వుంది. గొంతు వింటుంటే వయస్సు ఇరవై వుండొచ్చనిపించింది.

"నేను కాటెయ్యటానికి రాలేదు. ఈ రాత్రి సముద్రంతో చివరి సమావేశానికి వచ్చాను."

"అంటే?"

"ఆత్మహత్య చేసుకోవటానికొచ్చాను. దూరంగా నీ ఏడుపు విన్పించి..."

ఆమె ఏడుపు విన్పించి తనెందుకు అక్కడికి రావాలనుకున్నాడో ఇప్పుడర్థం కాలేదతనికి. చనిపోయే వాడికి ఎవరెవరి ఏడుపుల్తో, నవ్వుల్తో నిమిత్తం ఏమిటి? అసలు తన ఆత్మహత్య సంగతి మాత్రం ఆమెకెందుకు చెప్పాలి?

అతని మాటలు నమ్మిందామె. ఒకసారి నిట్టూర్చి జుట్టు ముడేసుకుంది. కొంగుతో మొహం తుడుచుకుంది. తర్వాత కొంగు నడుముకి చుట్టుకుంది. చుట్టూ చీకట్లోకి ఒక్కసారి చూసి, "అయితే పద. ఇద్దరం కలిసే చనిపోదాం." అంది నిశ్చయంగా.

దయాకర్ సందేహించాడు. తనకి తోడుగా ఈ అమ్మాయిని కూడా తీసుకుపోవటమా? ఊహు... తన మరణంతోనూ మరొకళ్లకి సంబంధం వుండటానికి వీల్లేదు. బహుశా ఈమేదో ఉద్రేకంలో వుంది. ఆ కారణమేదో తెలుసుకోకుండా?.... తన మరణం మరో గంట వాయిదా వేసి తెలుసుకుంటేనేం? .... అయినా తెలుసుకుని తనేం చెయ్యగలడిప్పుడు? ఈమెనేం కాపాడగలడు? ఎవర్నైనా ఎందుకు కాపాడాలి తనీ సమయంలో? కాబట్టి తెలుసుకోకపోతేనేం?... అయినా తెలుసుకుంటేనేం? అన్నీ ద్వంద్వాలే. ఎన్నో ద్వంద్వాల మధ్య దారి దొరక్క చివరికీ మార్గం ఎన్నుకున్నాడు తను. చివరగా జీవన్మరణాల ద్వంద్వాన్ని మాత్రం ఛేదించబోతున్నాడు.

"తెల్లారటానికి చాలా సమయం వుంది. అప్పటి దాకా ఈ చీకట్లో మన చావు కెలాంటి అభ్యంతరమూ వుండదు. కాబట్టి ఈలోగా నీ బాధకి కారణమేమిటో చెప్పు" అడిగాడు దయాకర్.

ఇసకలో చతికిల పడుతూ ఆమెవైపు చూశాడు. కాస్త ఎడంగా కూర్చుందామె.

"తప్పకుండా చెబుతాను. ఈ మాత్రం జాలికి మొహం వాచిపోయాను చాన్నాళ్లుగా"

దయాకర్ ఆమె మాటల కడ్డొచ్చాడు.

"నో నో. నాకు జాలి లేదు. జాలి లేని లోకం మీద జాలిపడటం మానేశాను. కేవలం నా మరణం మరో గంట వాయిదా వేసుకున్నాను గనుక వింటాను."

"పోనీ లెండి. మీకు జాలి లేకున్నా గాలికి చెప్పుకున్నట్టు నా బాధ చెప్పుకుంటాను. గుండె బరువైనా తగ్గుతుంది" అని ఒక్క క్షణం ఆగిందామె.

సముద్రం హోరు సముద్రం హోరులాగే వుంది. ఏడుపులాగా లేదు. ఒక్కో అలా వాళ్ల కాళ్లకి తగిలీ తగలకుండా వెనక్కి వెళ్లిపోతోంది. దూరంగా సరివి తోటలో గాలి చిక్కుబడి విలపిస్తోంది. నీలాకాశంలో మబ్బులు నిర్మలంగా వున్నాయి.

"నా పేరు సుమతి. మాది సంప్రదాయ కుటుంబం. అమ్మ లేదు. సవతి తల్లి మాత్రం ఉంది. ఆమె రాకతో నాన్న కూడా సవతి తండ్రే అయ్యాడు. మొత్తం నలుగురు పిల్లల్లో నేనే

పరాయిదాన్ని. అయితే, ఇంట్లో ఆ పరాయితనం గురించి కాదు ఇప్పటి నా విచారం."

'మరి?' అన్నట్టు చూశాడు దయాకర్. సుమతి గొంతు సవరించుకుని మళ్లీ చెప్పసాగింది. ఈసారి ఆమె కంఠం బరువెక్కింది.

"మొన్ననే డిగ్రీ పరీక్షలు రాశాను. ఆపైన చదివిస్తారనే ఆశ లేదు. నా కిష్టం లేకున్నా ఇవాళ పెళ్లి చూపులున్నాయి. 'అమ్మ'కి దగ్గర బంధువు. అవిటివాడు. అతని అవిటితనం మీద నాకేమీ అసహ్యం లేదు. కానీ నా అభిప్రాయంతో నిమిత్తం లేదా? నాకింకా చదువుకోవాలనుంది. నా కాళ్లమీద నేను నిలబడాలి. నాన్న కూడా ఆమెమాటనే సపోర్ట్ చేశాడు. గత్యంతరం లేదు. అటు పెళ్లి. లేదా ఇటు చావు. రెండోదే ఎన్నుకొన్నాను. నా ఫ్రెండ్ లలితను కలిసి వస్తానని ఒప్పించి బయటపడ్డాను. ఈ సముద్రం ఒడ్డుకి వచ్చాను. చుట్టూ ఉల్లాసంగా ఎంతమంది మనుషులు! ఏ కుళ్లూ లేని ఈ సముద్రం! నాలోనే ఈ దుఃఖం. బీచ్ నిర్మానుష్యమైన తర్వాత ఆత్మహత్య చేసుకుందామని ఆగాను. నన్ను వెదకటానికి తప్పకుండా వాళ్లొస్తారని ఒక వైపు భయంగా వుంది. ఇంతలో నువ్వు దగ్గరకొచ్చావు." ఏడవసాగింది సుమతి.

"ఏడవొద్దు నువ్వు. భరించలేను. నువ్వేడుస్తుంటే ఈ లోకంతో పాటు నేను కూడా నీ ముందు అపరాధినే అనిపిస్తుంది. ఊరుకో, ఈ ప్రపంచం నిన్నే కాదు, నన్నూ అవమానించింది" అన్నాడు దయాకర్ సముద్రం వైపే తీవ్రంగా, లోతుగా చూస్తూ.

"అంటే?"

"గాయం. తీవ్రమైన గాయం. ప్రపంచం నీ మీద ఒక విధంగా బలవంతం చేస్తే నా మీద మరో విధంగా చేసింది. నన్ను నన్నుగా బతకనివ్వలేదు. ఈ ప్రపంచంతో తీరని శత్రుత్వం నాది. చిన్నప్పుడు నేను స్కూలుకి వెళ్లకుండా వెళ్లానని అబద్ధం ఆడితే మా నాన్న తన్నాడు. ఆయనే తాగొచ్చి తాగలేదని అబద్ధం ఆడేవాడు. అమ్మా నాన్నా ప్రతిరోజూ తిట్టుకుంటూ ప్రతి రోజూ ఒకే పక్కమీద పడుకుంటూ దాంపత్యం నటించారు. పిల్లల మీద ప్రేమ నటించారు. కాలేజీలో మాస్టర్లు ఎన్నటికీ పనికిరాని పాఠాలు చెబుతూ సంఘసేవ చేస్తున్నట్టు నటించారు.

"చాలా మంది నన్ను మేధావి నన్నారు మొదట్లో. సూపర్ కండక్టివిటీ మీద నేను రాసిన వ్యాసాలు పెద్ద సంచలనం కలిగించాయి. కానీ ఎవ్వడూ ఉద్యోగమివ్వడు. ఇచ్చినా అరగొర జీతం. ప్రపంచంలో నేను మాత్రమే చెయ్యగల విషయాలున్నాయి. కాని నా సృజనాత్మకత ఎవడికి పట్టింది? ఎన్ని ఇంటర్వ్యూలకు ఆఫీసుల చుట్టూ తిరిగాను? ప్రశ్నలు వేసే వాడికి జవాబులు తెలీవు. 'భూగోళం బరువెంత?' అని అడిగాడొకడు. నీ తలకాయంత అని వచ్చేశాను.

'బతకటం చేతకాని మూర్ఖుడు' అన్నారు. ఎవడు మూర్ఖుడు? మేధావుల్ని కాలదన్ని, గూండాల్ని బలిపిస్తున్న ఈ దేశం పెద్ద మూర్ఖురాలు. ఈ ప్రజలు మూర్ఖులు. వాడు... వాడు

నాకు తెలిసి నాలుగు హత్యలు చేశాడు. ప్రజానాయకు డయ్యాడు. నడి బజార్లో వాడి విగ్రహావిష్కరణ. అందరూ చూస్తుండగా వెళ్లి దానిమీద ఉమ్మేశాను. నన్ను తరిమి కొట్టారు. రెండు రోజుల్నుంచి తిండి లేదు. గాయం, ఎక్కడో లోతైన గాయం. ఈ ప్రపంచం నన్ను మనిషిగా, మేధావిగా గుర్తించలేదు. నేను మాత్రం దీన్నెందుకు గుర్తించాలి? నా మరణంతో ఈ ప్రపంచాన్ని గుర్తించటం మానేస్తాను."

తన సంగతి మరిచిపోయి అతని వంకే చూస్తుండిపోయింది సుమతి. మెల్లగా తేరుకుంది.

"నేనొక అభాగ్యురాల్ని. కానీ నీలాంటి వాళ్లు చనిపోతే దేశానికే నష్టం. నేను నీ స్థానంలో ఉంటే చచ్చిపోను."

కాసేపు ఏం మాట్లాడలేదు దయాకర్.

ఒక్క నిముషం ఆగి, "నేను నా గాయాల్ని శాశ్వతంగా మాన్పుకునే ప్రయత్నంలో వున్నాను." అంటూ లేచాడు.

"అంటే?..."

సముద్రం వైపు వేలు చూపించాడు దయాకర్.

" నన్నూ నీతోపాటు తీసుకెళ్లు. ఇద్దరం కలిసే చచ్చిపోదాం."

"ఇది ఒంటరి ప్రయాణం. అయినా చావబోయే వాళ్లకి చేయూతెందుకు? నిముషం గడిస్తే మన శవాలెక్కడెక్కడ తేల్తాయో? మన అస్తిత్వమే మిగలదు. అయినా...." సగంలో ఆగిపోయాడు దయాకర్.

" అయినా?" రెట్టించింది సుమతి.

"నన్నడిగితే నువ్వు ఆత్మహత్య చేసుకోవాల్సిన పని లేదు."

"ఎందుకని?"

"చదువు, చక్కదనం ఉన్నదానివి. ఇప్పటి నీ కష్టం తప్పించుకోగలిగితే ఎవరైనా నిన్ను సంతోషంగా చేసుకుంటారు."

"వట్టి అభాగ్యురాల్ని. నన్నెవరు కోరుకుంటారు? నువ్వయితే చేసుకుంటావా?"

" నే నంటావా? తప్పకుండా చేసుకుందును. కానీ ఇప్పటి నా పని వేరు. బతుకు లోతును చూశాను. సముద్రం లోతునే నేనిప్పుడు పరీక్షించాలి. నా గాయాలు శాశ్వతంగా మాసిపోవాలి."

ఒక్కసారిగా పైకి లేచాడు. మెల్లగా తడి ఇసుకలో, తడిలో, అలల్లో, పెద్ద కెరటాల్లో అడుగులు వేస్తూ, సముద్రం లోతుల్లోకి..... సుమతి నిస్సహాయంగా చూస్తుండిపోయింది. ఇంతలో

దూరంగా ఏవో రెండు ఆకారాలు వస్తున్నాయి అటువైపు. సుమతి భయంతో బిగుసుకు పోయింది.

"అదుగో అక్కడ కూర్చుందిరా పెళ్లికూతురు! పద, పెళ్లి చేద్దాం."

"పెళ్లి కాదురా, ముందు దీనికి శోభనం చెయ్యాలి. అప్పుడు గాని దారికి రాదు." అంటోంది రెండో గొంతు. కనుచీకటిలో కుంటుకుంటూ నడుస్తోంది.

సముద్రం హోరు మధ్య దయాకర్ చెవులు రిక్కించాడు. రెండు మగ గొంతులు. సుమతిని వెతుకుతూ వచ్చిన వాళ్లు. ఇష్టం లేదన్న అమ్మాయిపైన అత్యాచారమా? హో! ఏం లోకం ఇది?

"జాగర్త. పారిపోనియ్యద్దు. సరివి తోటలోకి లాక్కెళదాం."

"ఒహోయ్!" అరుస్తూ రెండు ఆకారాలు గంతులేస్తూ దగ్గరకొచ్చాయి.

సుమతి భయంతో వణికిపోయింది. నోట మాట రాలేదు. పెద్ద కెరటాల్లోనుంచి, అలల్లోనుంచి, తడిలోనుంచి, ఇసుకమీదకి వచ్చాడు దయాకర్. సుమతి దీనంగా దయాకర్ని వాటేసుకుంది. ఆమె గుండెలు పగుల్తున్న చప్పుడు వినబడుతోంది దయాకర్కి. తనేం చెయ్యాలి? ఆమెతో పాటు సముద్రంలో దూకితే? కానీ అంతమాత్రాన ఆమె గాయం మాసిపోతుందా?"

అతని ఆలోచన తెగేలోగా ఒక ఆకారం దురుసుగా సుమతి చెయ్యి పట్టుకుంది. మరోటి దయాకర్ని పట్టుకు లాగింది. వెయ్యి ముళ్ల స్పర్శ. గుప్పున విస్కీ వాసన.

లేదు, లేదు. ఇక్కడ పలాయనానికీ, మరణానికీ తావు లేదు. ఏ దుర్మార్గం మీదైనా కడదాకా పోరాడాల్సిందే. ఆమె మీద అత్యాచారానికి తను సాక్షీభూతుడై అపరాధి కాలేడు. లేదు, లేదు. మరొక్క గాయాన్ని సహించేది లేదు. గాయానికి ప్రతీకారం తీర్చుకోవాల్సిందే. శరీరం సహకరించటం లేదు. రెండు రోజుల ఆకలి శరీరం. అయినా శక్తిని పూనాల్సిందే. గాయం - గాయం. ప్రతీకారం - ప్రతీకారం.

వాడు సుమతిని తన నుంచి వేరుచేసి ఇసుకలో బరబరా లాక్కెళుతున్నాడు. ఆమెలో ప్రతిఘటించే శక్తి లేదు. సన్నగా ఏడుస్తోంది. రెండోవాడు తన మొహంలో మొహం పెట్టి అనుమానంగా చూస్తున్నాడు. కడుపు తెమిల్చే వాసన. జీవితాన్ని తెమిల్చే అవమానం.

దయాకర్ ఒక్కసారిగా చేతులు విదిలించుకుని ఎదుటి మనిషి పొట్టలో ఒక్క గుద్దు గుద్దాడు. ఊహించని దెబ్బకు దిమ్మెరపోయాడు వాడు. వాడు తేరుకునేలోగా దయాకర్ చేతుల్నిండా ఇసుక తీసుకుని కళ్లల్లో కొట్టాడు. గొల్లుమంటూ వాడు ఇసుకలో పొర్లాడసాగాడు కళ్లు నులుముకుంటూ.

దయాకర్లో ఉద్రేకం ఆగలేదు. 'రేయ్ ఆగు' అంటూ ఎక్కళ్లేని ఊపుతో పరిగెత్తుతూ

సుమతిని లాక్కెళుతున్న వాడి వెంట పడ్డాడు. కుంటికాలు మీద ఒక్క తన్ను తన్నాడు. వాడు తూలి పడి, మళ్లీ పైకి లేచాడు. వాడు తమాయించుకునేలోగా దయాకర్ ఎగిరి మీదకి దూకి, వాడి గొంతు చంకలో ఇరికించుకున్నాడు. విడిపించుకోవటానికి విశ్వప్రయత్నం చేశాడు వాడు. దయాకర్ చేతుల్ని పట్టుకు లాగాడు, గుద్దాడు, రక్కాడు. కానీ దయాకర్ వదల్లేదు. తనలో ఇంకా అంత శక్తి ఎక్కడుందో తెలీదు. వాడి శరీరం తెలివితప్పి ఇసకలో దభీమని పడిందాకా వదల్లేదు. అది చూసి రెండోవాడు భయపడ్డాడు. కళ్లు నులుముకుంటూనే పరిగెత్తాడు.

యుద్ధం ముగిసింది. కెరటాల హోరు తప్ప అంతా నిశ్శబ్దం. అలల నురుగుపైన తెల్లదనం తప్ప అంతా చీకటి.

దయాకర్ తనేం చేశాడో, ఎందుకు చేశాడో ఒక్క క్షణం అర్థం కాని పరిస్థితిలో అలాగే నిలబడ్డాడు. సుమతి పరిగెత్తుకుంటూ వచ్చి అమాంతం దయాకర్‌ని వాటేసుకుంది. ఆమె కళ్లనుంచి కృతజ్ఞతో, లేక ప్రేమో కన్నీరై ప్రవహిస్తోంది. అప్రయత్నంగా దయాకర్ ఆమెని హృదయానికి హత్తుకున్నాడు. ఎంత ఉపశమనం! జీవితానికి జీవితం తోడు.

రెండు నిముషాలు గడిచాయి. అతని కౌగిలి నుంచి విడిపోకుండా సుమతి మొహం పైకెత్తి చూస్తూ అడిగింది. "ఇప్పుడేం చేద్దాం?"

"నా గాయానికేదో మందు దొరికినట్టుంది. అది మానవచ్చు. కనుక మన పని మానుకుందాం. ఇక మన మరణం ఒక జీవిత కాలం లేటు. పద, ఇద్దరం సముద్రంలో మునుగుదాం. లోతు చూట్టానికి కాదు. పైకి తేలి, రెండో జీవితాన్ని నిస్సంకోచంగా ప్రారంభించటానికి."

దయాకర్ ఆమె చెయ్యి పట్టుకుని తడి ఇసుకలో ముందుకు నడిచాడు. తెలీని ధైర్యంతో కన్నీళ్లు తుడుచుకుంది సుమతి.

నీలాకాశం మిలమిలలాడుతోంది.

దూరంగా ఏదో వెలుతురు కన్పిస్తోంది.